teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక



సెప్టెంబర్ 25-28 వరకు
వరల్డ్ ఫుడ్ ఇండియా 2025

WORLD FOOD INDIA
2025 25th to 28th September
Processing for Prosperity


05


ములుగు | సంపుటి : 04 | సంచిక : 106 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 24 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## భారత్ - పాక్ మధ్య గగనతల
# నిషేధం పొడిగింపు



### పాక్ విమానాలకు భారత గగనతలం మూసివేత

- ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కొనసాగుతున్న ఆంక్షలు
- అక్టోబర్ 24 వరకు పొడిగిస్తూ ఇరు దేశాలు నోటం జారీ
- ప్రయాణికులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు

భారత్, పాకిస్తాన్‌ల మధ్య కొనసాగుతున్న గగనతల నిషేధాన్ని భారత ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ కూడా భారత్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. మంగళవారం ఈ మేరకు గగనతలం మూసివేతను పొడిగిస్తూ రెండు దేశాలు వేర్వేరుగా నోటీసులు టు ఎయిర్‌మెన్ జారీ చేశాయి.





## కృష్ణా జలాలపై వాదనలు బలంగా వినిపిస్తున్నాం

- ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడాన్ని వ్యతిరేకిస్తాం
- ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్తాం : మంత్రి ఉత్తమ్
- కృష్ణా జలాల్లో 555 TMCలు కేటాయించాలని డిమాండ్
- గత ప్రభుత్వ ఒప్పందాలతో ఏకీభవించం

.. వివరాలు 2లో



## రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

- డ్రెస్సింగ్ సెన్స్ లేదు, మిమ్మల్ని చూస్తే భయంగా ఉంది
- కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- నష్టపరిహారం ఇవ్వక పోవడంపై కోర్టు అసంతృప్తి
- నష్టపరిహారం కోరిన మహిళపైనే అక్రమ కేసులు పెట్టడంపై తీవ్ర అభ్యంతరం
- తీర్పును యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

.. వివరాలు 2లో



## గ్రూప్-1 ఫలితాల రద్దుపై
# హైకోర్టులో మరో అప్పీలు

- సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన అభ్యర్థి
- అభ్యర్థి అప్పీలును విచారణకు స్వీకరించిన సీజే ధర్మాసనం
- ఇప్పటికే టీజీపీఎస్సీ సైతం అప్పీలు దాఖలు
- మార్చి 10న వెలువడిన గ్రూప్-1 ఫలితాలను రద్దు చేసిన సింగిల్ బెంచ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 విషయంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గ్రూప్-1 ఫలితాలు రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు

మిగతా 2 లో

## వరంగల్‌లో కొత్తగా సీజీహెచ్ఎస్
# వెల్‌నెస్ సెంటర్

- ఏర్పాటుకు కేంద్రం ఆమోదం: కిషన్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు వైద్య సౌకర్యాలు
- సామాన్య ప్రజలకు కూడా ఓపీడీ సేవలు అందుబాటులోకి
- ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్న కిషన్ రెడ్డి



02



## మన బతుకమ్మ 2025
# పాట ప్రోమో విడుదల

### సోషల్ మీడియాలో ట్రెండింగ్

02

- గోరటి వెంకన్న సాహిత్యం, సురేష్ బొబ్బిలి సంగీతం
- అదితి భవరాజు, మంగ్లీ, గోరటి వెంకన్న ఆలపించారు
- పల్లె దృశ్యాలతో అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు బద్రప్ప

## బీసీ రిజర్వేషన్ల ఖరారుపై
# కవిత సంచలన ట్వీట్

- కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్లపై నేడో, రేపో జీవో విడుదలయ్యే అవకాశం
- బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటం కొనసాగిస్తాం



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ నేడో, రేపో బీసీ సంక్షేమ శాఖ జీవో విడుదల చేయనుంది. ఆ జీవో ఆధారంగా

మిగతా 2 లో



02

## వంద రోజుల్లో మేడారం
# గద్దెల నిర్మాణం

- ఎంత ఖర్చయినా పున:నిర్మాణ పనులు పూర్తి చేస్తాం
- సమ్మక్క, సారలమ్మ గద్దెల డిజైన్ ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

## రైతులకు రేవంత్ సర్కార్
# గుడ్ న్యూస్

- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు ముమ్మరం చేసిన ప్రభుత్వం
- అక్టోబర్ మొదటి వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- ఈ ఏడాది కూడా సన్న వడ్లకు రూ.500 బోనస్
- యూరియా సమస్యను పరిష్కరించాలని సీఎం ఆదేశాలు



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర రైతాంగానికి రేవంత్ సర్కార్ పండుగ లాంటి వార్త. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లకు వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే, ఈ నెలాఖరున వరి కోతలు

మిగతా 2 లో

## రేషన్ డీలర్ల వ్యథపై
# హరీష్ రావు ఆగ్రహం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు దారుణం
- ఎన్నికల హామీలు అమలు చేయని ప్రభుత్వంపై ఫైర్
- రేషన్ డీలర్ల జీవితాలతో కాంగ్రెస్, బీజేపీ చెలగాటం
- బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌రి



02



## ప్రకటించిన 71వ జాతీయ
# చలన చిత్ర అవార్డులు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం

02

## ఓటు చోరీకి వ్యతిరేకంగా
# కాంగ్రెస్ ఉద్యమం

- టీపీసీసీ జూమ్ మీటింగ్‌లో మీనాక్షి నటరాజన్ పిలుపు
- అక్టోబర్ 15 నాటికి సంతకాల సేకరణ పూర్తి చేయాలి
- మోడీ, అమిత్ షా ద్వయం ఓటు చోరీకి పాల్పడ్డారని ఆరోపణ
- డిజిటల్ మెంబర్‌షిప్‌లో నంబర్‌వన్‌గా నిలవడంపై హర్షం వ్యక్తం



# భారత్ - పాక్ మధ్య గగనతల నిషేధం పొడిగింపు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): భారత్, పాకిస్తాన్‌ల మధ్య కొనసాగుతున్న గగనతల నిషేధాన్ని భారత ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ కూడా భారత్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. మంగళవారం ఈ మేరకు గగనతలం మూసివేతను పొడిగిస్తూ రెండు దేశాలు వేర్వేరుగా నోటీసులు టు ఎయిర్‌మెన్ (NOTAM) జారీ చేశాయి. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఏప్రిల్ నెల నుంచి ఇరు దేశాలు ఈ ఆంక్షలను కొనసాగిస్తున్నాయి. భారత్ ప్రతి నెలా గగనతలం మూసివేతపై ఆంక్షలు పొడిగిస్తూ వస్తోంది. ఈ నెల 24 వరకు ఉన్న నిషేధాన్ని ఇప్పుడు అక్టోబర్ 24 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకారం, పాకిస్తాన్ నుంచి వచ్చే విమానాలతో పాటు, ఆపరేటర్లు, లీజుకు తీసుకున్న విమానాలు, సైనిక విమానాలు సహా అన్ని రకాల పాకిస్తాన్ విమానాలకు భారత గగనతలంలోకి ప్రవేశం నిషేధించబడింది. నోటీసులు టు ఎయిర్‌మెన్ (NOTAM) అనేది విమాన కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని అందించే ఒక ముఖ్యమైన నోటీసు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులను జారీ చేస్తుంటారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ దుర్ఘటన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ ఉగ్రదాడిలో పాకిస్తాన్ హస్తం ఉందని భారత్




ఆరోపించగా, పాకిస్తాన్ ఈ ఆరోపణలను ఖండించింది. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ ఉద్రిక్తత కారణంగానే పాకిస్తాన్‌కు భారత గగనతలం మూసివేయబడింది. ఈ గగనతల నిషేధం పొడిగింపు వల్ల రెండు దేశాల మధ్య విమాన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇది ప్రయాణికులకు, ఎగుమతి–దిగుమతి వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యల పరిష్కారానికి ఇరు దేశాలు దౌత్య మార్గాలను అనుసరించడం అవసరం అని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాలు తమ భద్రతాపరమైన ఆందోళనల కారణంగా రాజీ పడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.

## కృష్ణా జలాలపై వాదనలు బలంగా వినిపిస్తున్నాం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): కృష్ణా జలాల వివాదంపై ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం తమ వాదనలను వినిపిస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమ వాదనల వివరాలను వెల్లడించారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచే అంశాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఏ ప్రభుత్వం ఉన్నా తమ రాష్ట్ర వాటా విషయంలో రాజీ పడేది లేదని కృష్ణా, గోదావరి జలాల్లో తమ వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ మూడు రోజుల పాటు వాదనలు వినిపిస్తున్నారు. కృష్ణా నది ప్రవాహం, క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకు 70 శాతం నీటి వాటా కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 %ఏీజ%ల నీటిని కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో తాము ఏకీభవించడం లేదని, అందుకే ఫైల్ రీఓపెన్ చేసి మొదటి నుంచి వాదనలను వినిపిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అండర్ సెక్షన్ 3 రిఫరెన్స్ పై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, ఫిబ్రవరి నుంచి వాదనలు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం తుది వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. ఈ వాదనలపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇప్పటికే బ్రీఫింగ్ జరిగిందని, తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం పూర్తిస్థాయిలో పోరాడుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## రేషన్ డీలర్ల వ్యథపై హరీష్ రావు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఎన్నికల ముందు కాంగ్రెస్ తమకు ప్రతి నెలా రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రేషన్ డీలర్లు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక రేషన్ కమీషన్ బకాయిలు విడుదల చేయకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో రేషన్ డీలర్ల వ్యథపై మాజీ మంత్రి హరీశ్‌రావు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గమని అన్నారు. నిరుపేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్ డీలర్లకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయమని కామెంట్ చేశారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు ఇబ్బందులు పడుతుంటే సర్కార్ మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా హామీలపై నేటికీ అతీగతీ లేదన్నారు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచేస్తున్నారని ఫైర్ అయ్యారు. మాటలు తప్ప చేతలు లేని కోతల ప్రభుత్వం ఇదేనని సైటైర్లు వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని అన్నారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను రూ.900 నుంచి రూ.1,400 పెంచామని గుర్తు చేశారు. నాడు ప్రభుత్వంపై రూ.139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కేసీఆర్ ధీటైన నిర్ణయం తీసుకున్నారని హరీశ్ రావు కొనియాడారు. రాష్ట్రంలో 17 వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఘటన బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని హరీశ్ రావు తెలిపారు. కమీషన్ చెల్లించడమే కాదు. కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షీప్ మంజూరు చేశామని పేర్కొన్నారు. రేషన్ డీలర్ల వయో పరిమితిని రూ.40 నుంచి రూ.50 ఏళ్లకు పెంచామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబర్ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ.5 వేల గౌరవ వేతనం, కమీషన్ పెంపు ప్రకటించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు.

## వంద రోజుల్లో మేడారం గద్దెల నిర్మాణం: సీఎం రేవంత్ రెడ్డి



ములుగు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతాన్ని నూతన పరిజ్ఞానంతో ఎంత ఖర్చయినా వెనకాడకుండా వంద రోజుల్లో పూర్తి చేయనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. దాదాపు రెండు గంటల పాటు అధికారులు గిరిజనులు ఆర్కియాలజీ అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి నూతన కట్టడాన్ని ఖరారు చేశారు. మేడారం గద్దెల ప్రాంగణాన్ని చేరుకున్న ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటన చేశారు. సంబంధిత అధికారులు సిమెంట్ తో నిర్మాణం చేయాలని ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించినప్పటికీ వెయ్యి కాలాలపాటు నిలిచిపోయే విధంగా రాతితో కట్టడాలు చేయాలని తాను సూచించానని వివరించారు. గతంలో రామప్పను రుద్ర దేవుడు రాతితో కట్టడాలు చేయడం వల్లే అది నేటికి చిరస్థాయిగా నిలిచిపోయి యునెస్కో గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. తాము రాయితో కట్టే సమ్మక్క సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులు చిరస్థాయిగా ఉండే విధంగా ఏర్పాట్లు చేయబోతున్నామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర అవార్డులు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన భవనం 2లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2023వ సంవత్సరానికి గాను ఈ అవార్డులను ప్రకటించగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం స్టార్ట్ అయింది. ఇందులో ఉత్తమ చిత్రంగా 12th ఫెయిల్' (హిందీ) నిలవగా, ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్) అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ (రాణి ముఖర్జీ) గెలుచుకోగా ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవంత్ కేసరి' అవార్డు అందుకుంది.

ఉత్తమ జాతీయ చిత్రం: 12th ఫెయిల్
ఉత్తమ నటుడు: షారుఖ్ ఖాన్ (జవాన్)
ఉత్తమ నటుడు: విక్రాంత్ మస్సే (12th ఫెయిల్)
ఉత్తమ నటి: రాణి ముఖర్జీ (రాణి ముఖర్జీ)
ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్, స్టంట్ కొరియోగ్రఫీ: హనుమాన్
బెస్ట్ లిరిక్స్ : బలగం (ఊరు పల్లెటూరు)
బెస్ట్ స్క్రీన్ ప్లే : బేబి (సాయి రాజేష్ నీలం)
బెస్ట్ మెయిల్ ప్లే బ్యాక్ సింగర్ : రోహిత్
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: సుకృతి వేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు)

## రైతులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి




ప్రారంభమవుతోన్న వేళ అక్టోబర్ మొదటి వారం నుంచి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సర్కార్ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. అదేవిధంగా ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు ప్రక్రియ సుమారు మూడ నెలల పాటు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ఇక సన్న వడ్లను పండించిన రైతులకు ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూరియా సమస్యను పూర్తిగా నివారించేందుకు యుద్ధ ప్రాతిపదికన పని చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

## గ్రూప్-1 ఫలితాల రద్దుపై హైకోర్టులో మరో అప్పీలు

మొదటి పేజీ తరువాయి

సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై మరో అప్పీలు దాఖలైంది. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ గ్రూప్–1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి అప్పీలు దాఖలు చేశారు. అభ్యర్థి అప్పీలును సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

**టీజీపీఎస్సీ సైతం:**

గ్రూప్–1 ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ఏడాది మార్చి 10న వెలువరించిన గ్రూప్–1 ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంగింగ్ లిస్టు, మార్కుల జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ నెల 9వ తేదీన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అభ్యంతరం వ్యక్తం చేసింది. మా వాదనలను ధర్మాసనం పరిగణలోకి తీసుకోలేదని పేర్కొంటూ ఈ తీర్పును డివిజన్ బెంచ్ లో అప్పీలు చేసింది.

## వరంగల్‌లో కొత్తగా సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్

వరంగల్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీఎచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక ఒపీడీ చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" దార్శనికతకు సాక్ష్యంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.

## రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్‌కు డ్రెస్సింగ్ సెన్స్ సరిగా లేదని, ఆయనను చూస్తే మాకే భయంగా ఉందని సీరియస్ అయింది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీకి ఆదేశించింది. మిడ్ మానేరు నిర్వాసితురాలు వనబట్ల కవితకు నష్టపరిహారం ఇవ్వాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. కానీ ఆమెకు నష్టపరిహారం ఇవ్వకపోగా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఆమెపైనే అక్రమంగా కేసులు పెట్టారు. దీంతో కవిత మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ పై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం. విచారణ కోసం కోర్టుకు హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డ్రెస్సింగ్ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టు ప్రొసీడింగ్స్ తెలియదా? కోర్టుకు వచ్చే పద్ధతి ఇదేనా? మిమ్మల్ని చూస్తే మాకే భయంగా ఉంది ఇక ప్రజలకు ఎలా సేవ చేస్తారని ప్రశ్నించింది. నిర్వాసితురాలు కవిత విషయంలో గతంలో ఇచ్చిన నష్టపరిహారం తీర్పును యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వానికి, సీఎస్‌కు హైకోర్టు ఆదేశించింది. అలాగే కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీని ఆదేశించింది.

## మన బతుకమ్మ 2025 పాట ప్రోమో విడుదల

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'మన బతుకమ్మ 2025' పాట ప్రోమో విడుదలైంది. ప్రోమోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. పూర్తి పాటను ఈరోజు సాయంత్రం 8 గంటలకు రిలీజ్ చేయనున్నారు. ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అద్భుతమైన సాహిత్యం అందించగా సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు. అదితి భవరాజు, మంగ్లీ, గోరటి వెంకన్న ఆలపించగా ఈశ్వర్ పెంటి (ప్రేమలో ఫేమ్) నృత్య రూపకల్పన చేశారు. దర్శకుడు బద్రప్ప గాజుల ప్రతి సన్నివేశాన్ని సజీవ చిత్రంగా మలచగా, శ్యామ్ దుపాటి, ఉదయ్ గుర్రాల (సినిమాటోగ్రఫీ) తెలంగాణ పల్లె దృశ్యాలు, పండుగ వాతావరణం, ఉత్సాహం అన్నింటినీ అద్దం పట్టినట్లుగా అద్భుతంగా తెరకెక్కించారు. ఓ తంగేడు పూల తల్లి బతుకమ్మ అంటూ సాగే ఈ పాటను తెలంగాణ ఆడపడుచులు ఆడిపాడుకునేలా రూపొందించారు. 49 సెకన్ల నిడివి గల ఈ ప్రోమో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

## బీసీ రిజర్వేషన్ల ఖరారుపై కవిత సంచలన ట్వీట్

మొదటి పేజీ తరువాయి



పంచాయతీ రాజ్ శాఖ మరో జీవో ఇచ్చి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అమలు చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లపై జిల్లా స్థాయి అధికారులు కసరత్తును పూర్తి చేశారు. అయితే, రిజర్వేషన్ల విషయం బయట ఎక్కడ ప్రస్తావించొద్దని ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు కలెక్టర్లు వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎంపీ కవిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా సంచలన ట్వీట్ చేశారు. కులగణన సర్వే వివరాలు బయటపెట్టకుండా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే ప్రయత్నంలో కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర కనపడుతోందని కామెంట్ చేశారు. తమకు అనుకూలంగా ఉన్న చోట రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ప్రకటించే లోపే కుల గణన సర్వే వివరాలు వెల్లడించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. హడావిడిగా ఎన్నికలు నిర్వహించి రాజకీయ ప్రయోజనం పొందదానికి ప్రయత్నిస్తే బీసీలకు అన్యాయం చేసినట్లేనని గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు వెల్లడించాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేస్తోందని రిజర్వేషన్ల పెంపు సాధించే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

# నర్సాపూర్ సెక్టార్ పరిధిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



ములుగు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ములుగు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నర్సాపూర్ సెక్టార్ అడవి రంగాపూర్ జిపి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసిడిఎస్ నర్సాపూర్ సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్ వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ములుగు ప్రాజెక్టు సిడిపిఓ శిరీష హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సిడిపిఓ శిరీష మాట్లాడుతూ స్త్రీ శిశు ,వృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషణమాసం సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించాలని సూచించారు. ఐసిడిఎస్ లాబోక్తులకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి రోజూ ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం అందించడం జరుగుతుందని,ఆరోగ్య లక్ష్మి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లాభోక్తులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.పౌష్ఠికాహారం ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ఆహార పదార్థాలతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకోవాలని గర్భిణీ స్త్రీలకు,తల్లులకు సూచించారు. ఈ సందర్భంగా పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా అంగన్వాడీ టీచర్లు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఇవి అక్కడున్న అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సెక్టార్ సూపర్ వైజర్ కళావతి, ములుగు డీసీ మమత ములుగు బ్లాక్ కోఆర్డినేటర్ వెంకటరాజు స్టేట్ ఈక్వాలిటీ నాగేశ్వరరావు అంగన్వాడీ టీచర్లు నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిషోర బాలికలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. ఈ పోషణ మాసంలో భాగంగా సాౖమాన్ పిల్లలను కూడా గుర్తించి వారికి సరిహైన పోషకాహారం అందించాలని చెప్పడం జరిగింది

# ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



భూపాలపల్లి, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైలారం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో10 వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్ మధుసూదన్ జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. ప్రజలకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులు సూచనలు తెలియజేశారు. ప్రజలు మరియు భూగోళం కొరకు ఆయుర్వేద అవసరం అనే నినాదంతో ముందుకు సాగుతుంది. ఈ మెగా వైద్య ఆరోగ్య శిబిరంలో 425 మందికి మోకాళ్ల నొప్పులు, వంటి నొప్పులు మరియు చర్మ సంబంధిత వ్యాధులకు షుగర్ సంబంధిత వ్యాధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు ప్రజలకు యోగా విశిష్టత గురించి తెలియజేశారు. ఈ మెగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో డాక్టర్ తనూజ రాణి డిస్టిక్ కోఆర్డినేటర్ మరియు డాక్టర్ సారంగపాణి డాక్టర్ జగదీష్ కన్నా డాక్టర్ గీత ఫార్మసిస్టులు సుమలత ,జార్జి రెడ్డి సుమన్, ఎం. సుమన్,యోగ ఇన్స్ట్రకటర్,విజయ ఏఎన్ఎం జిల్లా ఎపడమిక్ సభ్యులు తలతోటి పరమేశ్వర్, ఊరుగొండ గోపి, రమేష్ కుమార్ కాపర్తి రాజు ఆశా కార్యకర్తలు మౌనిక, రమ, సుజాత ఆరోగ్య కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మేడారం వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి



పరకాల, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతర అభివృద్ధి, ఆలయ విస్తరణ, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆదివాసీలు దేశానికి మూలవాసులు

**ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి**

**పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు**

**సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం**

**రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**





ములుగు జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం కు హెలికాప్టర్ లో 12 గంటల 27 నిముషాలకు చేరుకున్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిరిసిల్ల రాజయ్య రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు పోరిక బాలరాం నాయక్, డా. కడియం కావ్య , ఎమ్మెల్సీలు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్.పి. శబరిష్, పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ నుండి కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో ముఖ్య మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయ నృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం గద్దెల వద్దకు సీఎం కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించి, శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలోరాష్ట్ర మంత్రులు, సీనియర్ అదికారులు, పూజారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సీఎం తెలుసుకున్నారు. ఆలయాన్ని విస్తరణ, అభివృద్ధిని ముక్తకంఠంతో పూజారులు, ఆదివాసీ సంఘాలు ఏకీభవించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ

వందరోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించానాని, ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉందనీ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశాం అని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయిన వారి జన్మ ధన్యమవుతుందనీ తెలిపారు. ఇలాంటి అవకాశం ఈ జన్మకు దక్కిన వరం లాంటిది ఆదాయం ఆశించి కాదు భక్తితో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా పనిచేయాలన్నారు. జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైనచోట చెక్ డ్యామ్ లు నిర్మించాలని, రాబోయే వంద రోజులు సమ్మక్క సారలమ్మ మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనిచేయాలన్నారు. నిధులు గ్రీన్ చానల్ లో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పనులు పూర్తి చేయించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక డెడికేటెడ్ టీమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జాతరకు విచ్చేయు భక్తులకు మరింత సౌకర్య వంతంగా ప్రభుత్వ పక్షాన కల్పించాలనే ధ్యేయంతో, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని సమ్మక్క సారమ్మల గద్దెలు ప్రాంగణ మరియు పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే, వారిని భాగస్వాములను చేస్తూ ఆలయ అభివృద్ధి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, ఈ జాతర తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులని, నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నాన ని, ఫిబ్రవరి 6, 2023 న ఈ గద్దమీద నుంచే పాదయాత్ర మొదలుపెట్టా నని, సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించి, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం అని వివరించారు. సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో మీ అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చాం అన్నారు. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం అన్నారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు.

మేడారం జాతర తెలంగాణ సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుందని, ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడారంలో శ్రీ సమ్మక్క–సారలమ్మ గద్దెలు మరియు ప్రాంగణ పునరుద్ధరణ పనుల డీజన్లను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న నేపథ్యంలో మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించడానికి నిధులను కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరా ఆలోచన చేయాలని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ ప్రాంగణం కూడా ఒక గొప్ప దేవాలయమని, ఈ జాతరకు ఎన్నో ఏళ్ల చరిత్ర పోరాట ప్రతిమ రాచరిక మీద తిరుగుబాటు జెండా ఎగరేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆసియాలోని అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునరుద్ధరించడం కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మన ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గద్దెల పునరుద్ధరణ లో భాగంగా భక్తుల విశ్వాసం నమ్మకం ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా, జాతర ప్రాశస్త్యం అనేక శతాబ్దాలు గుర్తుండి పోయేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. వనదేవతల ప్రాంగణాన్ని పూర్తిగా గ్రానైట్ రాయి తో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. శ్రీ సమ్మక్క సారలమ్మ చరిత్ర 13వ శతాబ్దంలో మొదలైందని మరో వెయ్యి సంవత్సరాలు జాతర వైభోగం, ఆదివాసి సాంప్రదాయాలు, గుర్తుండేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

గతంలో శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరుకోవడం జరిగిందని అదే మాదిరిగా నా కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగి జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరమే మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని స్వయంగా ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని అదే మాదిరిగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని వెంటనే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ ఆసీసుల ద్వారా సకల జనులు బాగుంటారని అన్నారు. ప్రజా పాలన రావాలని ముఖ్యమంత్రి మేడారం ప్రాంతం నుంచి పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని తల్లుల ఆశీర్వాదంతోనే ప్రజా పాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందని అదే విధంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి కి తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. వెయ్యేళ్ళ పాటు పటిష్టమైన రీతిలో ఉండేలా నిర్మాణం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గద్దెల విస్తరణ విషయంలో అనేక అపోహలు ఉన్న నేపథ్యంలో నిర్మాణం ఏ విధంగా జరగాలని, ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడడం కోసం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి రావడం అనేది చాలా సంతోషంగా ఉందని తల్లుల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం వర్ధిల్లాలని అన్నారు.అనంతరం మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, శాసన సభ్యులుడా. తెల్లం వెంకట రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, డా. మురళి నాయక్ , రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మా బొజ్జు, తెలంగాణ అటవి అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఏటూరు నాగారం ఎఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈ ఓ వీరస్వామి, జిల్లా అధికారులు, పూజారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహర్షి కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తో మెహందీ కార్యక్రమం




ములుగు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని స్థానిక మహర్షి డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రోగ్రాం ఆఫీసర్ టీ. సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో నేడు నాలుగో రోజు సందర్భంగా విద్యార్థులు మెహందీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మెహేంది ద్వారా ప్రత్యేకంగా మహిళలకు గల ఉపయోగాలు వివరిస్తూ వివిధ రకాల డిజైన్స్ లో తమ చేతులపై వేసుకుంటూ వీటిని వేయడం నేర్చుకోవడం ద్వారా ఉపాధి పొందడంతో పాటు సాంప్రదాయ పద్ధతులలో ఉపయోగించే గోరింటాకు ద్వార అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయని అలాగే భారతదేశంలోని మహిళలు సాంస్కృతిక వేడుకలు వివిధ శుభ కార్యాలకు గోరింటాకు ఉపయోగిస్తారని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహర్షి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చి రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ ఎన్. సంజయ్ కుమార్ డైరెక్టర్ ఎస్ వెంకట్ రెడ్డి అధ్యాపకులు ఏ. రమ్య. ఎస్. కుమార్, కి, నరేష్ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం దురదృష్టకరం

## మాజీ సర్పంచులను అరెస్టు చేయడం హేయమైన చర్య

### సానికొమ్ము రమేష్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు




ములుగు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం చేసుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం వస్తున్న సందర్భంగా గ్రామ పంచాయతీల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని ములుగు మండల అధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు చెల్లించడం లేదని, కాంగ్రెస్ మంత్రులను కలిసినా కూడా ప్రయోజనం లేకుండా పోయిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రికి నిధులు చెల్లించాలని వినతి పత్రం ఇచ్చిన కూడా ఇప్పటివరకు గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించలేదని, మాజీ సర్పంచులు మనోవేదనకు గురవుతున్నారని, అప్పులు పెరిగిపోతున్నాయని వారు నిరసన తెలియజేస్తే వాళ్లని ఈరోజు అరెస్టులు చేయడం బాధాకరమైన విషయమని తెలిపారు. సమ్మక్క సారలమ్మ తల్లులు పాలించిన జిల్లా ములుగు అని అలాంటి జిల్లాకు ఉద్యమాలు కొత్తవి కావని, తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని తరిమి కొట్టిన రాయిని గూడెం సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు వస్తాయని రమేష్ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు అరెస్ట్ అయిన టిఆర్ఎస్ పార్టీ నాయకులను, మాజీ సర్పంచుల మద్దతుగా పోలీస్ స్టేషన్ వెళ్లి వారి మద్దతుగా నిరసన తెలిపారు.

**అరెస్టు అయిన వారి వివరాలు**

మాజీ సర్పంచ్ భూక్యా పవన్ కుమార్, దాసరి రమేష్, జిల్లా యూత్ అధ్యక్షులు కోగిల మహేష్, మాజీ సర్పంచ్ మోరే రాజన్న, మాజీ ఎంపిటిసి గొర్రె సమ్మయ్య, కవ్వంపల్లి బాబు, మేకల సంజీవ్ ఈ కార్యక్రమంలో ములుగు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, దొడ్డ వెంకటరెడ్డి, వాంకుడోత్ రాందాస్, బాలు, గొర్రె రఘుపతి, నునావత్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే నాయకులుగా ఎదుగాలి

### బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు దినేష్, అశోక్, దిలీప్ కుమార్





చిట్యాల, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలంలోని జుకల్ బీఎన్ఆర్ పక్షన్ హాల్ లో బిఆర్ఎస్వి చిట్యాల మండల నాయకులు గుర్రం సుశ్రీత్, పుట్టపాక నర్సింహా అధ్యక్షతన, జరిగిన భారత రాష్ట్ర సమితి, విద్యార్థి విభాగం మీటింగ్ కు,ముఖ్య అతిథిగా హాజరైన టిఆర్ఎస్వి జిల్లా, నాయకులు సెగ్గం దినేష్, భూపాలపల్లి మండల అధ్యక్షులు అమృత అశోక్, జిల్లా నాయకులు, కొల్లోజు దిలీప్ కుమార్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో ఇక్కడ చూసిన ఏ జిల్లాలో చూసిన కేసిఆర్ చేసిన అభివృద్ధి కనబడుతుందని, ఈరోజు ప్రతి ఒక్క జిల్లాలో చూసిన విద్యా వ్యవస్థను, పెంపొందించిన ఘనత మన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అలాగే జిల్లాలో ఉన్నటువంటి మెడికల్ కాలేజ్ అయితే నేమి, డిగ్రీ కాలేజ్, ఐటిఐ కాలేజ్, జూనియర్ కాలేజీ ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఒక్క మండలంలో ఉన్నటువంటి మోడల్ స్కూల్, గురుకులాలు, భూపాలపల్లిని విద్యా వ్యవస్థలో ముందు ఉంచిన, ఘనత మన నాయకుడు గండ్ర వెంకట రమణ రెడ్డిని అలాగే ఇప్పుడు చూసుకున్నట్లయితే, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యా సంస్థకు, మంత్రి లేకపోవడం సిగ్గుచేటని,మన జిల్లాలో చూసుకున్నట్లయితే, ఇప్పుడు జరుగుతున్నటువంటి, విద్యా వ్యవస్థలోని సమస్యలను, తీర్చాలంటే ప్రతి ఒక్క విద్యార్థి బిఆర్ఎస్వి జెండా చేతుల పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, దేవేందర్ యాదవ్, బానోతు మహేశ్వర్, ఎర్రవెల్లి ప్రశాంత్, యాదవ్ ,భూక్య హరీష్, రాజు, చిట్యాల మండలం విద్యార్థులు పాల్గొన్నారు.

# గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద వ్యక్తి

### వైద్యానికి ఆర్థిక సహాయం చేసిన ప్రొ. జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్





కాటారం, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని, చింతకాని గ్రామానికి చెందిన ఆత్కూరి మొగిలి గత కొంత కాలం నుండి గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు, వారిది నిరుపేద కుటుంబం కావడంతో అతడు తన వైద్య ఖర్చులకోసం, జయశంకర్ ఫౌండేషన్ వారిని ఆశ్రయించడంతో, వెంటనే స్పందించిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్, అయిలి మారుతి, వారి ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని, నీకేం కాదని మనోధైర్యం కల్పించి, అతని వైద్యానికి ఆర్థిక సహాయం, అందజేయడం జరిగింది.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన గ్రామ పాలన అధికారులు



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం నూతనంగా నియమించిన గ్రామ పాలన అధికారులు భాద్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను తన చాంబర్ లో కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామపాలన అదికారులుగా విధులలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

# విత్తనోత్పత్తి క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



కన్నాయి గూడెం, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మంగళవారం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం పథకం లో భాగంగా కన్నాయి గూడెం మండలలోని పలు గ్రామాలలో ఇచ్చిన WGL 962 అనే వరి రకం పొలాలను యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు కలిసి క్షేత్ర ప్రదర్శన చెయ్యడం జరిగింది. వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త మధు మాట్లాడుతూ వరి చిరు పొట్ట దశలో వుండటం గమనించి ఎకరానికి 25 కేజీ యూరియా మరియు 25 కేజీ ల పొటాష్ వేసుకోమని రైతులకు చెప్పడం జరిగింది. అంతేకాకుండా ఈ దశలో వచ్చే కంకి నల్లి నివారణకు స్పిరోమెసిఫెన్ 1 ml లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి అని రైతులకు తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తల గోన్య నాయక్ మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి మరియు విత్తనం సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

# కోతులు కుక్కల బారి నుండి ప్రజలను రక్షించాలి

### కోతులు కుక్కల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్న అధికారులు : సిపిఐ డిమాండ్



కొత్తగూడెం (అర్బన్), సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): కోతులు, కుక్కల భారీ నుండి ప్రజలను కాపాడాలని ఈ సమస్యలను పరిష్కరించడంలో కార్పొరేషన్ అధికారులు విఫ్లమవుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్ లు విమర్శించారు. మంగళవారం స్థానిక వనం దాస్ గడ్డలో కోతులు కుక్కల సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రామవరం ప్రాంతంలో కోతులు, కుక్కలు మనుషులపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నాయని, ప్రజలు భయాందోళన చెబుతున్నారని వారు ఆవేదన చెందారు. కోతులు ఇండ్లలో జొరబడి ఇంట్లోని వస్తువులను కిరాణా సరుకులను చిందరవందర చేస్తూ, ఇంటిపైకి ఎక్కి రేకులు పడగొడుతున్నాయని అన్నారు. గత 4 రోజుల క్రితం ఒక మున్సిపల్ ఉద్యోగిపై కోతులు దాడి చేసి నా మున్సిపల్ అధికారులకు చలనం లేదని తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కొత్తగూడెం మున్సిపాలిటీలో ఉన్న కోతులు, కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కోతులు కుక్కల సమస్యలపై మున్సిపాలిటీపై దశల వారి ఆందోళనకు సమావేశం తీర్మానం చేశారు .ఈ సమావేశంలో ఉన్నదాసు గడ్డ శాఖ వన్ సహాయ కార్యదర్శి తోగరు నరేంద్ర కుమార్, శాఖ టు కార్యదర్శి ఎస్కే జలీల్, సీనియర్ నాయకులు ఆది మల్లయ్య, సూరి మేని రామారావు, కడారి మల్లేష్, శంకర్, నాగోల్ మీరా, అలిమ్, రమేష్, వెంకన్న, కృషీద్, పాష తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ మార్కెట్ పనులు వేగవంతంగా చేపట్టాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పింకేష్ కుమార్



జనగామ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): పట్టణంలోని అంబేద్కర్ నగర్లో సుమారు 6 కోట్ల తో నిర్మిస్తున్న సమీకృత మోడల్ మార్కెట్ భవన నిర్మాణ పనులను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ మంగళవారం సంబంధిత అధికారులతో ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించారు. ప్రజలకు అతి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతో చేపట్టిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మంగళవారం ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం జిల్లా కేంద్రంలో గల లయన్స్ భవన్ నందు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ వెంకట్ రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ వీరన్న, సెక్రటరీ రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంప్ ఇంచార్జ్ మరియు జిల్లా ఆయుష్ ఇంచార్జ్ డాక్టర్ పి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, ఈ శిబిరంలో 300 మందికి పైగా వైద్య సేవలు పొందారని, వచ్చిన వాళ్ళకి వైద్య సేవలు అందించడంతో పాటుగా ప్రతిరోజు ఆచరించవలసిన కనీస యోగాసనాలు నేర్పించి పాటించవలసిన ఆరోగ్య సూత్రాలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు రవికుమార్, పూజిత, సూర్యం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ మరియు సిబ్బంది కిషన్, రమేష్, ఇందుమతి, సజయ్, వీరన్న, శైలజ, స్వరూప, సుకన్య మరియు యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచార వ్యూహాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. జిల్లాలోని విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో వైద్యాధికారుల సహకారంతో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని, డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా అవసరమైన చికిత్స అందించాలని తెలిపారు. అటవీశాఖ అధికారులు, వారి పరిధిలోని అటవీ భూములను పరిశీలించి, గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే, ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సూచనలు జారీ చేయడం జరిగింది. ఇంటర్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగ వల్ల కలిగే నష్టాలపై ఈ వారం లో ప్రణాళికలు రూపొందించాలని, యువత, విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అని అన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటదశలోనే కట్టడి చేయాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లు, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. అదనంగా, యువతలో రక్తదానం అవగాహన కల్పించి రక్తదాన శిబిరాలు, అనిమీయ పరీక్షలు నిర్వహించమని, నర్సింగ్, %చీజజ% శిక్షణ ద్వారా యువతకు మార్గనిర్దేశం చేయాలని, మాదకద్రవ్య నియంత్రణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలు సమకూర్చేందుకు అవసరమైన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇల్లందు డిఎస్పి చంద్రబాను, ఎక్సైజ్ సూపరింటెంట్ జానయ్య, ఇంటర్మీడియట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయంలో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు

## పాల్గొన్న అదనపు కలెక్టర్ మరియు శిక్షణ కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): దసరా సంబరాల్లో భాగంగా మూడవ రోజు జరుపుకునే ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ , శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ హాజరై, మహిళా ఉద్యోగులతో కలిసి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పూజలో పాల్గొని ఆడి, పాడారు. సంప్రదాయం ప్రకారం చామంతి, మందార, సీతమ్మజడ, రామబాణం వంటి పూలతో మూడంతరాలలో బతుకమ్మను నిర్మించి, తామర పాత్రల్లో కళాత్మకంగా అలంకరించడం జరిగింది. మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పూలతో బతుకమ్మను అందంగా అలంకరించడమే కాకుండా భక్తి భావంతో నృత్యాలు, ఆడిపాడుతూ సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకగా జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యక్రమం మరింత రసవత్తరంగా సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం వల్ల సాంఘిక ఐక్యత బలపడుతుందని పేర్కొన్నారు. అలాగే ముద్దపప్పు బతుకమ్మ సమర్పణ ఆరోగ్యం, ఐశ్వర్యం, కుటుంబ శ్రేయస్సుకు దోహదం చేస్తుందనే విశ్వాసాన్ని అన్నారు. శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ ఇటువంటి పండుగలు ఉద్యోగుల మధ్య సఖ్యత, సామరస్య వాతావరణాన్ని పెంచుతాయని, కార్యాలయ వాతావరణంలో ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. ఈ వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా, వైద్య శాఖ సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.




# పత్తి కొనుగోలు పారదర్శకంగా జరగాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జిల్లావ్యాప్తంగా పత్తి కొనుగోలు పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక, రవాణా మరియు పోలీస్ శాఖలతో పత్తి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పత్రిక కొనుగోలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ విధానాల ప్రకారం న్యాయమైన మద్దతు ధర పొందేలా ప్రతి అధికారి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,72,937 ఎకరాలలో పత్తి పంట సాగు జరిగిందని, 26 లక్షల 56,14 0 క్వింటాళ్ల పత్తి దిగుబడి కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. 2025-26 గాను పత్తికి మద్దతు ధర 8110/- ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. పత్తి కొనుగోలు చేపట్టడానికి గాను సీసీ ఐ క్రింద ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా, రైతు ఇచ్చిన పత్తి బరువును కచ్చితంగా నమోదు కావాలని, వ్యాప్తంగా ఉన్న వే బ్రిడ్జి లను తనిఖీ చేయాలని తూనికలు కొలతల శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సకాలంలో జరగాలని ఇందుకోసం పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని సూచించారు, కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, వసతి, గోదాములు, తేమ పరీక్షించే యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో తీసుకువచ్చి అమ్మే విధంగా ఎటువంటి మధ్యవర్తులు లేదా అక్రమంగా పత్తి కొనుగోలు చేసి వారి ప్రభావానికి లోను కాకూడదని కలెక్టర్ సూచించారు. పత్తి మిల్లుల వద్ద ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పత్తి దిగుబడి అనంతరం పత్తి కట్టేను బయో చార్ తయారీ ఉపయోగించే విధంగా రైతులలో అవగాహన తీసుకురావాలని మిల్లర్లకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, తూనికలు కొలతలు శాఖాధికారి మనోహర్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, సంబంధిత శాఖల అధికారులు మరియు మిల్లర్లు పాల్గొన్నారు.

# గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాత



జయశంకర్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జయశంకర్, భూపాలపల్లి జిల్లా మంజూరునగార్ లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు దుర్గామాత అమ్మవారు శ్రీ గాయత్రీ అమ్మవారి అవతారమెత్తి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అర్చన మరియు చండీ పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్తలు గండ్ర వెంకట రమణా రెడ్డి జ్యోతిల కుటుంబ సమ్మేతంగా ముఖ్య అతిధులుగా, పాల్గొని ప్రత్యేక, పూజలు నిర్వహించారు.

# సదరం (యు.డి.ఐ.డి) క్యాంపులకు హాజరు కావాలి



జనగామ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సదరం యు డి ఐ డి క్యాంపులలో పాల్గొనే దివ్యాంగులు ఈనెల 24 వ తేదీ నుండి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జనగామ లో క్యాంపులు నిర్వహిస్తున్నందున ఈ సదవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసంత తెలిపారు. 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు లెప్రసీ, యాసిడ్ బాధితులు, వినికిడి లోపం ,కంటి చూపు కోల్పోయిన వారు, తల సేమియా, నరాల బలహీనత తదితర రుగ్మతలతో బాధపడుతున్న దివ్యాంగులకు కొత్తవి 110 స్లాట్లు కాగా 87 రెన్యువల్ ఉన్నాయని మొత్తంగా 197 ఉన్నట్లు తెలియజేశారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి ఫోన్ నెంబర్ కి మెసేజ్ రావడం జరుగుతుందని మెసేజ్ వచ్చిన తేదీలలో ప్రభుత్వ ఆసుపత్రి లోని యూ డి ఐ డి సదరం క్యాంపు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 8008202287 ను సంప్రదించాలన్నారు.

# ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉద్యమం



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఓట్ చోరీ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థలు సమీపిస్తున్న వేళ 'ఓట్ చోరీ'పై చేపడుతోన్న సంతకాల సేకరణ ప్రతి ఒక్కరూ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. అక్టోబర్ 15 నాటికి ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ పూర్తి కావాలన్నారు. లక్షలాదిగా సంతకాల సేకరణ చేసి ఆ కాపీలను ఏఐసీసీకి పంపాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీతో పాటు ఏఐసీసీ చేస్తున్న ఓట్ చోరీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ సైనికులు అంతా దన్నుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కాగా, పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. నరేంద్ర మోడీ, అమిత షా ద్వయం ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఓట్ చోరీకి పాల్పడి వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. ఓట్ చోరీపై ప్రజల్లో పూర్తి అవగాహన, చైతన్యం తీసుకొచ్చే బాధ్యతను అందుతూ తమ భుజాలపైకి ఎత్తుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో పాటు డీసీసీ అధ్యక్షులు, పలువురు ఎమ్మెల్యేలు, ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.

# గాంధీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



**బీజేపీ ప్రభుత్వంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్**

**జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ టాక్స్ : మంత్రి పొన్నం**

**గల్ఫ్ కార్మికుల సంక్షేమ బతుకమ్మ సంబురాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): గాంధీభవన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో సోమవారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ బతుకమ్మ సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు బతుకమ్మ సంబరాల్లో నగర మేయర్ విజయలక్ష్మి, సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు,ఎన్. ఆర్.ఐ చైర్మన్ వినోద్ కుమార్, సభ్యులు, చెన్నమనేని శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు కల్వ సుజాత, రైతు కమిషన్ మెంబర్ భవాని రెడ్డి, బొజ్జ సంధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇన్ని రోజులు పేద ప్రజల రక్తం తాగిందని మండిపడ్డారు. జీఎస్టీ తో పేదలకు లబ్ధి చేసినట్టు బీజేపీ నాయకులు బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు. జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మొదటి నుంచి చెప్తున్నామని అన్నారు. పేదలను దోచుకోవడానికి జీఎస్టీ తెచ్చారని, శవ పేటికలపై, పసి పిల్లల తినుబండారాలపై కూడా జీఎస్టీ వేశారని, జీఎస్టీ ట్యాక్స్ తో ఏదైనా మంచి పని చేశారా? అని ప్రశ్నించారు. ఆర్థిక సంక్షోభం నుంచి తప్పించుకోవడానికే మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని కేంద్రం జీఎస్టీ తగ్గింపు పై స్పందించారు.

# సెప్టెంబర్ 25-28 వరకు వరల్డ్ ఫుడ్ ఇండియా 2025

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 సెప్టెంబర్ 25 నుండి 28 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించబడుతుంది. వరల్డ్ ఫుడ్ ఇండియా 4వ ఎడిషన్ వైవిధ్యభరితమైన ఆహార ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడం, అలాగే భారతదేశ గొప్ప ఆహార సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. న్యూఢిల్లీలో మంగళవారం మీడియాతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాస్వాన్ మాట్లాడుతూ, వరల్డ్ ఫుడ్ ఇండియా కేవలం ఒక వాణిజ్య ప్రదర్శన మాత్రమే కాదని, ఆహార ఆవిష్కరణ, పెట్టుబడి మరియు స్థిరత్వానికి భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా ఉంచడానికి ఒక పరివర్తన వేదిక అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఈ కార్యక్రమం స్థిరమైన, సమ్మిళితమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఆహార వ్యవస్థల పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుందని మరియు ప్రపంచ ఆహార బుట్టగా భారతదేశం యొక్క స్థానాన్ని బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా, శ్రీ పాశ్వాన్ ఆహార ప్రాసెసింగ్ యొక్క విభిన్న భావనలపై తరచుగా అడిగే ప్రశ్నలు అనే ప్రచురణను కూడా ప్రారంభించారు. ప్రాసెస్ చేసిన ఆహారాలకు సంబంధించిన తప్పుదారి పట్టించే ప్రకటనల కోసం నిబంధనలను రూపొందించడానికి తన మంత్రిత్వ శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. న్యూజిలాండ్ మరియు సౌదీ అరేబియా వరల్డ్ ఫుడ్ ఇండియా 2025లో భాగస్వామ్య దేశాలుగా ఉన్నాయని, రష్యా, యుఎఇ, జపాన్ మరియు వియత్నాం ఫోకస్ దేశాలుగా ఉన్నాయని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమానికి 1700 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 500 మందికి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు మరియు 100 కి పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ మెగా గ్లోబల్ ఫుడ్ ఈవెంట్‌లో 21 కి పైగా దేశాలు, 21 భారతీయ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు మరియు 10 కేంద్ర మంత్రిత్వ శాఖలు పాల్గొంటాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

WORLD FOOD INDIA
2025 25th to 28th September
Processing for Prosperity

# పెరుగులో చక్కెర కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

## దీన్ని ఎవరు తినకూడదు అంటే..?



పెరుగును చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. భోజనం చివర్లో పెరుగుతో తినకపోతే చాలా మందికి భోజనం చేసిన ఫీలింగ్ కలగదు. కనుకనే అధిక శాతం మంది పెరుగన్నం తినేందుకు ఇష్టపడుతుంటారు. అయితే పెరుగులో చక్కెర కలిపి తినడం కూడా చాలా మందికి అలవాటు. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన ప్రజలు ఇలా ఎక్కువగా తింటారు. వారు మజ్జిగలో చక్కెర కలిపి దానికి లస్సీ అని పేరు పెట్టి తాగుతుంటారు. ప్రపంచ వ్యాప్తంగా పలు వర్గాలకు చెందిన ప్రజలు కూడా పెరుగులో చక్కెర కలిపి తింటుంటారు. అయితే పెరుగులో చక్కెర కలిపి తింటే అనేక లాభాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పెరుగులో చక్కెర కలిపి తినడం వల్ల పలు పోషకాలు లభించడంతోపాటు పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చని వారు అంటున్నారు.

**జీర్ణ వ్యవస్థకు..**

పెరుగు ప్రో బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే బ్యాక్టీరియా పెరుగును పులిసేలా చేస్తుంది. దీంతో పెరుగులో పోషక విలువలు పెరుగుతాయి. పెరుగులో లాక్టో బేసిల్లస్, బైఫైడో బాక్టీరియం అనే మంచి బ్యాక్టీరియా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం, మలబద్దకం, అసిడిటీ, అల్సర్ వంటి సమస్యలు తగ్గుతాయి. పెరుగులో చక్కెర కలిపి తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట ఉండవు. ఎంత పనిచేసినా అలసట రాదు. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి.


**హై క్వాలిటీ ప్రోటీన్లు..**

పెరుగులో హై క్వాలిటీ ప్రోటీన్లు ఉంటాయి. అందువల్ల దీన్ని తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాలకు మరమ్మత్తులు చేస్తాయి. కండరాల నిర్మాణానికి దోహదం చేస్తాయి. శరీరం విధులు సక్రమంగా నిర్వహించేందుకు ఉపయోగపడతాయి. పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను, దంతాలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. కండరాలు, నాడుల పనితీరును మెరుగు పరుస్తుంది. పెరుగులో చక్కెర కలిపి తినడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. కనుక వేడి వాతావరణంలో ఉండే వారు తింటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. వేడి నుంచి బయట పడవచ్చు. శరీరంలో ఉండే వేడి తగ్గి శరీరం చల్లగా మారుతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. మూత్రం సాఫీగా జారీ అవుతుంది.

**జాగ్రత్తలు తప్పనిసరి..**

అయితే పెరుగులో చక్కెర కలిపి తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగే మాట వాస్తవమే అయినప్పటికీ దీన్ని మోతాదులోనే తినాలి. చక్కెరను మరీ అతిగా కలపకూడదు. లేదంటే శరీరంలో క్యాలరీలు అధికంగా చేరుతాయి. దీని వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఇక డయాబెటిస్ ఉన్నవారు చక్కెరను వాడకూడదు. కానీ పెరుగును తినవచ్చు. అయితే కొవ్వు తీసిన పెరుగును తింటే మంచిది. ఇక అధిక బరువు తగ్గాలని చెప్పి డైట్‌లో ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని తినకపోవడమే మంచిది. అలాగే కొందరికి పాలు, పాల ఉత్పత్తులు పడవు. లాక్టోస్ ఇన్‌టాలరెన్స్ ఉంటుంది. అలాంటి వారు ఈ మిశ్రమాన్ని తినకూడదు. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని తినకూడదు. ఇలా పలు జాగ్రత్తలను పాటిస్తూ పెరుగు, చక్కెర మిశ్రమాన్ని తింటే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# జుట్టుకు మెగ్నీషియం జట్టు



వయసుతో సంబంధం లేకుండా అందర్నీ వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం. కొంతమందిలో అసలు జుట్టే పెరగట్లేదన్న ఆరోపణ ఉంటుంది. కానీ ఈ సమస్యలు వచ్చినప్పుడు అందరూ రకరకాల షాంపూలు, నూనెలు, సీరమ్‌లు అంటూ ప్రయోగాలు చేస్తారు తప్ప సమస్యకు మూలం కనుక్కోరు. నిజానికి జుట్టు ఆరోగ్యానికి శరీరంలోని మెగ్నీషియం స్థాయులకు దగ్గరి సంబంధం ఉంది. శరీరంలో మెగ్నీషియం లోపించినప్పుడే ఈ సమస్యలు వస్తాయి. ఇదే విషయాన్ని పరిశోధకులు ఎన్నో అధ్యయనాల్లో తేల్చారు కూడా. రోజువారీగా తీసుకునే ఆహారంలో శరీరానికి సరిపడా మెగ్నీషియం అందేలా చూసుకోవాలి.

అలాగే వైద్యులను సంప్రదించి మెగ్నీషియం సప్లిమెంట్లు తీసుకోవచ్చు. మాడుకు రక్త ప్రసరణ బాగా జరగడంలో, హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో, క్యాల్షియం స్థాయులను క్రమబద్ధీకరించడంలో మెగ్నీషియం తోడ్పడుతుంది. తద్వారా జుట్టుకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. మెగ్నీషియం లోపం వల్ల మాడుకు రక్త ప్రసరణ తగ్గడంతో పోషకాలు అందక జుట్టును సమస్యలు చుట్టుముడుతాయి. శరీరంలో సరైన మోతాదులో మెగ్నీషియం లేకపోతే, క్యాల్షియం ఎక్కువై కుదుళ్లు మూసుకుపోతాయి. దానివల్ల హెయిర్ సైకిల్ దెబ్బతింటుంది. అలాగే మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణం తగ్గి మాడుపై పుండ్లు, దురద లాంటి సమస్యలు వస్తాయి. శరీరానికి తగినంత మోతాదులో మెగ్నీషియం అందాలంటే ఈ కింద పేర్కొన్న ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి.

# బి12 లోపించకుండా.. బీ అలర్ట్

విటమిన్ బి12 లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ముఖ్యంగా బి12 లోపం వల్ల మహిళల్లో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నిజానికి ఇది మహిళల ఆరోగ్యానికి ఒక పవర్ హౌజ్ పోషకంలాంటిది. మెదడు పనితీరు, హార్మోన్ల సమతుల్యత, గుండె, ఎముకల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుంది. కానీ, విటమిన్ బి12 లోపిస్తే కలిగే రుగ్మతలు కూడా ఎక్కువే!




- విటమిన్ బి12 ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడి, ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపర్చి అలసటను దూరం చేస్తుంది.
- నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. ఇది నరాలు, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.
- హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్‌లను క్రమబద్ధీకరిస్తుంది.
- హెూమోసిస్టీన్ స్థాయుల నియంత్రణకు విటమిన్ బి12 సహకరిస్తుంది. అలాగే ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది.
- మహిళల్లో నెలసరిని క్రమబద్ధీకరించడంతో పాటు, గర్భిణిగా ఉన్నప్పుడు కడుపులోని బిడ్డ మెదడు ఎదుగుదలలో విటమిన్ బి12 కీలకంగా వ్యవహరిస్తుంది.
- లోపిస్తే..: శరీరంలో విటమిన్ బి12 లోపించినప్పుడు.. అలసట, జ్ఞాపకశక్తి తగ్గడం, చర్మం పసుపు రంగులోకి రావడం, నోటిలో పుండ్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కంటిచూపు మందగించడం, నెలసరి సమస్యలు, మానసిక ఆందోళన, అరచేతులు, అరికాళ్లలో తిమ్మిర్లు, మంటలు రావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురైన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అలాగే ఆహారం విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి.
- ఏం తినాలి?: సహజ పద్ధతిలో విటమిన్ బి12 పొందాలంటే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. గుడ్లు, పాలు, పెరుగు, చీజ్, పండ్లు, బీట్‌రూట్, పుట్టగొడుగులు, కోడి మాంసం, మేక మాంసం, చేపలు తీసుకోవడం వల్ల తగినంత బి12 లభిస్తుంది. సమస్య తీవ్రతనుబట్టి వైద్యుల పర్యవేక్షణలో ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లు తీసుకోవచ్చు.

# నేడు బంగ్లాదేశ్‌తో తలపడనున్న భారత్

## తుది జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం

ఆసియా కప్ 2025లో భాగంగా భారత్ పాకిస్థాన్ జట్టును సూపర్-4 మ్యాచ్‌లో చిత్తుగా ఓడించింది. ఇప్పుడు ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవడానికి నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తుది జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ బలహీనమైన జట్టు కావడం, గత మ్యాచ్‌లో బౌలర్లు, బ్యాటర్లు కొంత ఇబ్బంది పడటంతో ఈ మార్పులు అనివార్యం కానున్నాయి. బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో అంత పెద్దగా భారీ మార్పులు ఉండకపోవచ్చు. అయితే కొన్ని వ్యూహాత్మక మార్పులు భారత్‌కు మేలు చేయవచ్చు. గత మ్యాచ్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ లో 4 ఓవర్లలో 45 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన 3 మ్యాచ్‌లలో 11 ఓవర్లలో 92 పరుగులు ఇచ్చి కేవలం 3 వికెట్లు మాత్రమే తీశాడు. కాబట్టి బుమ్రా స్థానంలో టీమిండియా నంబర్ వన్ టీ20 బౌలర్ అయిన్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం లభించవచ్చు. అలాగే వికెట్ కీపర్, బ్యాటర్ సంజు శాంసన్ బ్యాటింగ్‌లో ఇబ్బందులు పడుతున్నాడు. పాకిస్తాన్‌పై 17 బంతుల్లో కేవలం 13 పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో సంజు శాంసన్ స్థానంలో జితేష్ శర్మకు అవకాశం ఇవ్వొచ్చు.




**బంగ్లాదేశ్‌పై భారత్ తుది జట్టు (అంచనా)**
అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ / జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా / అర్ష్‌దీప్ సింగ్.

# అనవసరంగా కవ్వించారు..

## బ్రహ్మోస్ లాంటి షాట్లతో వాళ్లు రిప్లై ఇచ్చారు

## పాక్ ప్లేయర్లపై మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా



టీమిండియా చేతుల్లో వరుసగా ఓడిపోతున్న పాకిస్థాన్ పై ఆదేశ మాజీ ప్లేయర్ డానిష్ కనేరియా అసహనం వ్యక్తం చేశాడు. తమ చేష్టలతో అనవసరంగా టీమిండియా ఆటగాళ్లను రెచ్చగొట్టారని దుయ్యబట్టాడు. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన ఆసియాకప్ సూపర్-4 లీగ్ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్ (58) స్టన్నింగ్ ఫిఫ్టీతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో శివమ్ దూబేకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ను 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి .. మరో 7 బంతులు మిగిలి ఉండగానే, భారత్ ఈజీ విక్టరీ సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ధనాధన్ ఫిఫ్టీ (39 బంతుల్లో 74, 6 ఫోర్లు, 5 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలర్లలో హరీస్ రౌఫ్ కు రెండు వికెట్లు దక్కాయి. తాజా విజయంతో సూపర్-4 పట్టికలో అగ్రస్తానాన్ని భారత్ సాధించింది. మ్యాచ్ తర్వాత కనేరియా మీడియాతో మాట్లాడుతూ.. పాక్ ప్లేయర్లపై ఫైరయ్యాడు..పాక్ బ్యాటింగ్ సమయంలో ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్ ఫిఫ్టీ పూర్తయ్యాక ఏకే-47 సిగ్నల్ తో భారత ఆటగాళ్లను కవ్వించాడని కనేరియా గుర్తు చేశాడు. ఆ తర్వాత ఇండియా బ్యాటింగ్ సమయంలో ఓపెనర్లు అభిషేక్, శుభమాన్ గిల్ బ్రహ్మోస్ మిస్సైళ్ల లాంటి షాట్లతో విరుచుకుపడ్డారని పేర్కొన్నాడు. భారత విధ్వంసక బ్యాటింగ్ కు పాక్ వద్ద సమాధానం లేకుండా పోయిందని, ఆటగాళ్లంతా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారని తెలిపాడు. ఇండియా బ్యాటింగ్ ముందు ఎంత పెద్ద లక్ష్యమైనా ఇట్టే కరిగిపోతుందని, బ్యాటింగ్ పవర్ సత్తా బాగుందని ప్రశంసించాడు. ఏదేమైనా టీమ్ మేనేజ్మెంట్ పక్కా ప్రణాళికతో మైదానంలో బరిలోకి దిగాల్సి ఉందని పాక్ కు సూచించాడు. ఓటములను కప్పి పుచ్చుకునేందుకు పాక్ సాకులు వెతుకుతోందని కనేరియా విమర్శించాడు. తొలి మ్యాచ్ లో హ్యాండ్ షేక్ వివాదం, తర్వాత మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్ పై ఐసీసీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఇక తాజా మ్యాచ్ లో ఫఖార్ జమాన్ క్యాచ్ ఔట్ పై రాద్ధాంతం చేస్తోందని, వికెట్ కీపర్ సంజూ శాంసన్ పట్టిన క్యాచ్ క్లీన్ గా ఉందని ప్రశంసించాడు. ఓటమిపై దృష్టి మళ్లించేందుకే పాక్ ఇలా చేస్తోందని విమర్శించాడు. ఏదేమైనా ఈ మ్యాచ్ లో పాక్ ఆటగాళ్లు క్లూ లెస్ గా కనిపించారని, భారత బ్యాటింగ్ ముందు తేలిపోయారని పేర్కొన్నాడు. ఇక సూపర్ -4కి నాలుగు జట్లు అర్హత సాధించాగా.. తమ తొలి మ్యాచ్ ల్లో పాక్ పై ఇండియా, శ్రీలంకపై బంగ్లాదేశ్ గెలుపొందాయి. బుధవారం లంకతో పాక్, బంగ్లాతో ఇండియా తలపడనున్నాయి. లంక-బంగ్లా మ్యాచ్ లో ఓడిన జట్టు దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఇండియా-బంగ్లా మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ బెర్త్ దాదాపుగా ఖరారు చేసుకుంటుంది. 2023 లో టోర్నీ గెలిచిన భారత్, డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగుతోంది.

# టీమిండియాకు ఐసీసీ భారీ జరిమానా!

ఆస్ట్రేలియాతో సిరీస్‌ను కోల్పోవడమే కాకుండా, భారత మహిళా క్రికెట్ జట్టుకు ఐసీసీ జరిమానా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ ఈ జరిమానా విధించింది. జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. ఈ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుపై కూడా జరిమానా విధించబడింది. ఆ జట్టు కూడా నిర్ణీత సమయంలో తమ ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఇప్పుడు భారత జట్టు ఈ తప్పు చేసింది. భారత జట్టు నిర్ణీత సమయం కంటే 2 ఓవర్లు తక్కువ వేసింది, దానివల్ల ఈ నష్టం జరిగింది.భారత జట్టు ఆస్ట్రేలియాపై మూడో వన్డేలో 43 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 412 పరుగులు చేయగా, దానికి సమాధానంగా భారత జట్టు 369 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన సెంచరీతో 125 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆమె స్ట్రైక్ రేట్ 198 కావడం విశేషం. మంధాన 63 బంతుల ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు, 17 ఫోర్లు కొట్టింది. ఈ క్రీడాకారిణి కేవలం 50 బంతుల్లోనే సెంచరీ చేసి చరిత్ర సృష్టించింది. మంధాన కాకుండా దీప్తి శర్మ 72 పరుగుల ఇన్నింగ్స్ ఆడింది. అలాగే, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 35 ఓవర్లలో 52 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లు ఉన్నప్పటికీ, ఆస్ట్రేలియా మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది.భారత జట్టు వన్డే సిరీస్‌ను కోల్పోయినప్పటికీ, ప్రపంచ కప్‌కు దాని సన్నాహాలు పక్కాగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ ఆస్ట్రేలియాపై 100 సగటుతో 300 పరుగులు చేసింది. ఇందులో ఆమె 2 సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ చేసింది. దీప్తి శర్మ కూడా 66 సగటుతో 132 పరుగులు చేసింది. బౌలింగ్‌లో క్రాంతి గౌడ్ 5 వికెట్లు తీసి మంచి ప్రదర్శన కనబరిచింది. అరుంధతి రెడ్డి, దీప్తి శర్మ చెరో 4 వికెట్లు పడగొట్టారు. ఇప్పుడు సొంత గడ్డపై జరగబోయే ప్రపంచ కప్‌లో భారత జట్టు ఎలా ఆడుతుందో, అది తన మొదటి ప్రపంచ కప్ గెలవగలదా అనేది చూడాలి.భారత మహిళా జట్టు సిరీస్ కోల్పోయినప్పటికీ, ఈ మ్యాచ్‌లలో వారి బ్యాటింగ్‌లో ఉన్న దూకుడు ప్రశంసనీయం. స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్ ప్రపంచ కప్‌లో జట్టుకు చాలా ఉపయోగపడుతుంది. స్లో ఓవర్ రేట్ అనేది ఒక చిన్న తప్పే అయినా, ఐసీసీ నిబంధనల ప్రకారం జరిమానా తప్పదు. ఈ పొరపాట్ల నుండి నేర్చుకుని ప్రపంచ కప్‌లో మెరుగైన ప్రదర్శన టీమిండియా ఇవ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# హాంకాంగ్ సిక్స్‌స్ కోసం భారత జట్టు కెప్టెన్‌గా కార్తీక్

భారత మాజీ క్రికెటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెంటర్ దినేష్ కార్తీక్ క్రికెట్ మైదానంలోకి తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నాడు. అతను మరోసారి టీమిండియా మాజీ స్పిన్ లెజెండ్ రవిచంద్రన్ అశ్విన్‌తో కలిసి మైదానంలో కనిపించనున్నాడు. నవంబర్ 7 నుంచి 9 వరకు జరిగే హాంకాంగ్ సిక్సస్ 2025 కోసం కార్తీక్ భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కార్తీక్ మార్గదర్శకత్వంలో, బెంగళూరు గత సీజన్‌లో మొదటి టైటిల్‌ను గెలుచుకుంది. అతను తన అంతర్జాతీయ అనుభవం, కెప్టెన్సీ నైపుణ్యాలు, తుఫాన్ బ్యాటింగ్‌తో జట్టు పనిని సులభతరం చేయగలడు. కెప్టెన్‌గా నియమితులైన తర్వాత, కార్తీక్ మాట్లాడుతూ, "ఇంత గొప్ప చరిత్ర, ప్రపంచ గుర్తింపు కలిగిన టోర్నమెంట్ అయిన హాంకాంగ్ సిక్సస్‌లో టీమ్ ఇండియాకు నాయకత్వం వహించడం గౌరవంగా ఉంది. ఇంత అద్భుతమైన రికార్డులు కలిగిన ఆటగాళ్ల బృందానికి నాయకత్వం వహించాలని నేను ఎదురు చూస్తున్నాను" అని తెలిపాడు. కార్తీక్ 2004లో భారత జట్టులోకి అరంగేట్రం చేసి 2022లో తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. టీమిండియా తరపున 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20లు ఆడిన ఈ అనుభవజ్ఞుడిని తిరిగి మైదానంలోకి చూడటం అభిమానులు ఆనందంగా ఉంటుంది. అతను 257 ఐపీఎల్ మ్యాచ్‌లలో కూడా ఆడాడు. 3,577 పరుగులు చేశాడు. కార్తీక్‌కు ఐపీఎల్‌లో అనేక జట్లకు ఆడిన అనుభవం ఉంది. అతను ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ లయన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడాడు.టోర్నమెంట్‌కు కార్తీక్ అందించిన సహకారం గురించి క్రికెట్ హాంకాంగ్ చైర్మన్ బుర్జీ ష్రాఫ్ వ్యాఖ్యానిస్తూ, "హాంకాంగ్ సిక్సర్స్ 2025 కోసం టీమ్ ఇండియా కెప్టెన్‌గా దినేష్ కార్తీక్‌ను స్వాగతిస్తున్నందుకు మేం చాలా సంతోషంగా ఉన్నాం. అతని నాయకత్వం, అనుభవం పోటీకి అపారమైన విలువను జోడిస్తాయి. అతని ఉనికి ఈ అద్భుతమైన క్రికెట్ పండుగను చూడటానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను ఆకర్షిస్తుందని మేం విశ్వసిస్తున్నాం" అని అన్నారు.

# జట్టులోకి అక్షర్ పటేల్ తిరిగి వచ్చేనా?




ప్రస్తుత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో తన స్వదేశీ సిరీస్‌ను ప్రారంభించనుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో ప్రారంభమవుతుంది. ప్రస్తుత ఇది టీమిండియా రెండవ టెస్ట్ సిరీస్ అవుతుంది. సెప్టెంబర్ 24న ఈ సిరీస్‌కు టీమిండియాను ఎంపిక చేస్తారు. దీనికి ముందు, ఆటగాళ్ల ప్లేస్‌మెంట్‌ల గురించి ప్రశ్నలు లేవనెత్తుతూ కొన్ని ఊహాగానాలు వెలువడ్డాయి. వికెట్ కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ ఇండియా-వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌లో పాల్గొనలేడు. ఇంగ్లాండ్ పర్యటనలో తన కాలి గాయం నుంచి అతను ఇంకా కోలుకోలేదు. దీంతో అతను సిరీస్ మధ్యలోనే నిష్క్రమించాల్సి వచ్చింది. పంత్ గైర్హాజరీలో, ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలను చేపట్టనున్నాడు. నారాయణ్ జగదీశన్ రిజర్వ్ కీపర్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.భారత టెస్ట్ జట్టులోకి అక్షర్ పటేల్ తిరిగి రావడం ఖాయం. అతను భారత పిచ్‌లపై సమర్థవంతంగా పనిచేస్తాడు. అతను బ్యాటింగ్‌తో కూడా ఉపయోగకరంగా ఉంటాడు. ఇది అతని సహకారాన్ని పెంచుతుంది. అతనితో పాటు, టీమిండియా స్పిన్ విభాగంలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్ కూడా ఉంటారు.మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లలో, మిగతా అన్ని స్థానాలు ఫిక్స్ అయ్యాయి. కానీ ఒక స్థానానికి కరుణ్ నాయర్, దేవదత్ పడిక్కల్ మధ్య పోటీ ఉంది. దేశీయ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత నాయర్‌ను ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. కానీ, అక్కడ తనదైన ముద్ర వేయలేకపోయాడు. గాయం కారణంగా పడిక్కల్‌ను ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేయలేదు. అతను ఇప్పుడు ఫిట్‌గా ఉన్నాడు. ఇటీవల ఇండియా ఏ తరపున అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. ఇతర బ్యాట్స్‌మెన్‌లలో, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్ ఎంపిక కావడం ఖాయం.ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ ఎంపికయ్యే అవకాశం ఉంది. వీరిలో బుమ్రా రెండవ టెస్ట్ మాత్రమే ఆడతాడని భావిస్తున్నారు. అతను ప్రస్తుతం ఆసియా కప్‌లో ఆడుతున్నాడు. దీని ఫైనల్ సెప్టెంబర్ 28న జరగనుంది. మొదటి టెస్ట్ అక్టోబర్ 2న జరుగుతుంది. రెండింటి మధ్య నాలుగు రోజులు మాత్రమే ఉంటుంది. పనిభారం నిర్వహణను పరిగణనలోకి తీసుకుంటే, బుమ్రాకు మొదటి టెస్ట్ నుంచి విశ్రాంతి ఇవ్వవచ్చు.



# అభిషేక్- గిల్‌పై యోగరాజ్‌సింగ్ ప్రశంసల వర్షం

ఆసియా కప్ 2025లో భాగంగా భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో యువ ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించారు. ఈ మ్యాచ్ అనంతరం మాజీ క్రికెటర్ యోగరాజ్ సింగ్ వారిద్దరి ప్రదర్శనపై ప్రశంసల వర్షం కురిపించారు. అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం ఉన్న ఫామ్‌ను చూస్తుంటే వారికి 250 పరుగుల లక్ష్యం ఇచ్చినా దాన్ని ఛేదించగలరని యోగరాజ్ సింగ్ అభిప్రాయపడ్డారు. అయితే దీని కోసం వారు కనీసం 15 ఓవర్ల వరకు క్రీజులో నిలబడాలని ఆయన సూచించారు. "అభిషేక్ 12-15 ఓవర్ల వరకు ఆడాలని నేను కోరుకుంటున్నాను. జట్టు చాలా వరకు వీరిద్దరిపైనే ఆధారపడుతోంది." అని యోగరాజ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్తాన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఈ ఇద్దరూ కలిసి 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అందులో అభిషేక్ శర్మ 74 పరుగులు, శుభ్‌మన్ గిల్ 47 పరుగులు చేశారు.అదే సమయంలో శుభ్‌మన్ గిల్ తన తప్పుల నుంచి నేర్చుకోవాలని యోగరాజ్ సింగ్ సలహా ఇచ్చారు. "శుభ్‌మన్ గిల్ ఒకే రకమైన బంతికి రెండుసార్లు బౌల్డ్ అయ్యాడు. అతడు ఈ విషయంలో మెరుగుపడాలి. మీరు ఎంత గొప్ప ఆటగాడు అయినా సరే, ఆట కంటే గొప్పవారు కాదు. ఆటగాళ్లు ఎప్పుడూ విద్యార్థిలా ఉండాలి" అని ఆయన సూచించారు.యువరాజ్ సింగ్ తండ్రి అయిన యోగరాజ్, అభిషేక్ శర్మ గురించి ఒక గొప్ప జోస్యం చెప్పారు. "అభిషేక్ శర్మ 20 ఓవర్ల పాటు క్రీజులో నిలబడితే, అతడు కచ్చితంగా 200 పరుగులు సాధించగలడు" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే కపిల్ దేవ్ లాంటి దిగ్గజాలు యువ ఆటగాళ్లను తయారు చేయాలని యోగరాజ్ సింగ్ సూచించారు. "కపిల్ దేవ్ నా చిన్ననాటి స్నేహితుడు. అతడు గొప్ప క్రికెటర్. అతడికి క్రికెట్ గురించి చాలా తెలుసు. అతడి లాంటి దిగ్గజాలు కనీసం ఒకరిద్దరు ఆటగాళ్లను తయారు చేయాలి" అని యోగరాజ్ సింగ్ అన్నారు.



# నాలుగుసార్లు మృత్యుముఖం నుంచి బయటపడ్డా

## కాంతారా నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి వెల్లడి

'కాంతార చాప్టర్ 1' షూటింగ్ సమయంలో నాలుగు సార్లు తాను చనిపోయేంత ప్రమాదం జరిగిందని.. ఆ దేవుడే తనను కాపాడాడని నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అందులో రిషబ్, రుక్మిణి వసంత్ పాల్గొన్నారు. కాంతార షూటింగ్‌లో జరిగిన ప్రమాదాల గురించి రిషబ్ స్పందించారు. షూటింగ్ సమయంలో తనకు నాలుగుసార్లు ప్రమాదం జరిగిందని రిషబ్ తెలిపారు. అప్పుడే తాను చనిపోయేవాడినేనని, ఆ దేవుడే తనను కాపాడాడని అన్నారు. ఆ దేవుడి ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే ఈ చిత్రం పూర్తయిందని చెప్పారు. ఈ సినిమా కోసం టీ-మ్ అంతా మూడు నెలలు నిరంతరం పని చేసిందని విశ్రాంతి కూడా తీసుకోలేదని తెలిపారు. ప్రతిఒక్కరూ దీన్ని వారి సొంత సినిమాగా భావించారని చెప్పారు. అలా అనుకున్నారు కాబట్టే ఎన్నో సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించగలిగామన్నారు. సెట్‌లో ఎన్నో ప్రమాదాలు జరిగాయని..అవన్నీ మీడియాలో వచ్చాయని వివరించారు. ఈ సినిమా ప్రారంభంలో చిత్రబృందంలోని వారంతా కొన్ని ప్రతిజ్ఞలు చేశారంటూ షేర్ అయిన పోస్టర్లపై రిషబ్ శెట్టి స్పందించారు. అవన్నీ ఫేక్ అని అన్నారు. కాంతార చాప్టర్ 1' టీ-మ్‌లోని వారు ధూమ-పానం, మద్యపానం, మాంసాహారానికి దూరంగా ఉన్నారని, ఈమేరకు వాళ్లు ప్రతిజ్ఞ చేసినట్లు- కొన్ని వార్తలు వచ్చాయి. నేను ప్రొడక్షన్ వారిని అడిగితే అలాంటిదేం లేదన్నారు. ఆ పోస్టర్లు అన్నీ ఫేక్. ఉద్దేశపూర్వకంగా అలాంటివి సృష్టించారంతే. వాటితో మా టీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని రిషబ్ తెలిపారు. కాంతార చాప్టర్ 1'లో రిషబ్ శెట్టి సరసన రుక్మిణి వసంత్ నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో ఆమె రాణి పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. నా కెరీర్ ప్రారంభ దశలోనే ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం ఆనందంగా ఉంది. టీమ్ సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. రిషబ్ గొప్ప నటుడు. కొన్ని సన్నివేశాల్లో ఆయన నటన చూసి ఆశ్చర్యపోయాను. ఈ సినిమా నా ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చింది. నా జీవితాన్ని మార్చేసిందని రుక్మిణి ఎమోషనల్ అయ్యారు.

# లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసులో కస్టమ్స్ దాడులు

## నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ నివాసాల్లో సోదాలు

కొచ్చి, సెప్టెంబర్ 23: మలయాళం స్టార్ హీరోస్ దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాలపై కస్టమ్స్ అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడులు మంగళవారం కొచ్చిలో పృథ్వీరాజ్ థేవరాలోని ఇంట్లో, అలాగే దుల్కర్ సల్మాన్ పనమ్పిల్లి నగర్‌లోని ఇంట్లో జరిగాయి. పృథ్వీరాజ్ తిరువనంతపురంలోని ఇంటిని కూడా అధికారులు తనిఖీ నిర్వహించారు. భూటాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా లగ్జరీ కార్లను స్మగ్లింగ్ చేస్తున్న ఒక పెద్ద నెట్‌వర్క్‌పై కస్టమ్స్ అధికారులు దేశవ్యాప్తంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖుల ఇళ్లపై దాడులు చేపట్టారు. కేరళలోని కొచ్చి, కోజికోడ్, మలప్పురంతో సహా దాదాపు 30 ప్రాంతాల్లో ఈ దాడులను ఏకకాలంలో కస్టమ్స్ అధికారులు చేపట్టారు. ఈ ఆపరేషన్‌కు 'నమ్‌కూర్' అని పేరు పెట్టారు. భూటాన్ సైన్యం ఉపయోగించిన లగ్జరీ కార్లను వేలంలో తక్కువ ధరలకు విక్రయించారు. అయితే ఈ పాత వాహనాలను కస్టమ్స్ సుంకాలు చెల్లించకుండా భారత్‌లోకి అక్రమంగా తరలిస్తున్నట్లు- కస్టమ్స్ అధికారులకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అం౦. దీంతో దేశ వ్యాప్తంగా పలువురు, సినీ , రాజకీయ, వ్యాపార ప్రముఖుల నివాసాలపై కస్టమ్స్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ హై-ఎండ్ వాహనాలను ముందుగా హిమాచల్ ప్రదేశ్‌కు అక్రమంగా రవాణా చేసి, అక్కడ తాత్కాలిక చిరునామాలతో రిజిస్టర్ చేసుకుంటారు ఈ లగ్జరీ కార్ల ముఠా. ఆ తర్వాత వీటిని ప్రముఖ సినీ నటు-లు, వ్యాపారవేత్తలకు ఓ ముఠా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు- అధికారులు గుర్తించారు. ఈ అక్రమ రవాణా కోసం ఏజెంట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు-చేసుకున్నారని అధికారులు తెలిపారు. భూటాన్- భారత్ మధ్య ఉన్న వ్యాపార ఒప్పందాల్లోని లసుగులను ఉపయోగించుకుని ఈ స్మగ్లింగ్‌కు పాల్పడు తున్నారని సమాచారం. భూటాన్‌లో ఈ వాహనాలను వేలంలో కొనడం చట్టబద్ధమే అయినప్పటికీ, భారత్‌లోకి సరైన పన్నులు చెల్లించకుండా తీసుకువచ్చి అమ్మడం కస్టమ్స్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతోందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ కేరళ, లక్షద్వీప్ కమిషనర్ పర్యవేక్షణలో జరుగుతోంది. సినీనటు-ల ఇళ్లతో పాటు- కలమస్సేరిలోని వ్యాపారవేత్తల నివాసాలు, మలప్పురం, కోజికోడ్‌లోని కార్ డీలర్‌షిప్‌లపై కూడా అధికారులు దాడులు చేస్తున్నారు.౦





# సోషల్ మీడియా షేక్ చేస్తున్న రుక్మిణి..!

రుక్మిణి వసంత్ ప్రెజంట్ యూత్ ఆడియన్స్ కి ఒక క్రష్ గా మారింది. కన్నడలో సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఆడియన్స్ అందరికీ దగ్గరైంది. ఇప్పటికే తమిళ్ లో వరుస క్రేజీ ప్రాజెక్ట్ లు చేస్తున్న అమ్మడు మోస్ట్ హ్యాపెనింగ్ మూవీ కాంతారా ప్రీక్వెల్ లో ఛాన్స్ అందుకుంది. కాంతారా సినిమాకు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే.. ఆ క్రేజ్ ని మరింత పెంచేలా రుక్మిణి తోడవుతుంది. కాంతారా ప్రీక్వెల్ లో రుక్మిణి వసంత్ కనకావతి రోల్ లో నటిస్తుంది. మహారాణి గెటప్ లో రుక్మిణి పోస్టర్ రిలీజ్ తోనే సూపర్ అనేశారు. ఇక కాంతారా ప్రీక్వెల్ ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ కాగా అందులో రుక్మిణి సీన్స్ అయి-ంతే వేరే లెవెల్ అనేలా ఉన్నాయి. రుక్మిణి వసంత్ కనకావతి రోల్ లో వారెవా అనిపించేసింది. అసలే యూత్ ఆడియన్స్ లో ఆమె క్రేజ్ ఒక రేంజ్ లో ఉండగా కాంతారా ట్రైలర్ లోనే రుక్మిణి వసంత్ సీన్స్ ఇంప్రెస్ చేశాయి. కాంతారా లో ఆమెను తీసుకోవడానికి రీజనే ఆమెకు ఉన్న ఈ పాపులారిటీ వర్క్ అవుట్ అవుతుందని. జస్ట్ ట్రైలర్ రిలీజ్ అయ్యింది అంతే అందులో ఆమె షాట్స్ ని ఫోటోల రూపంలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఏ హీరోయిన్ కి రాని క్రేజ్ రుక్మిణి వసంత్ కి వచ్చింది.



# నానితో కలిసి రాలేదు పీకేతోనైనా కలిసొస్తుందా?



కన్నడ బ్యూటీ ప్రియాంక మోహన్ నాని హీరోగా నటించిన గ్యాంగ్ లీడర్‌తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పటికి కన్నడలో ఒక్క సినిమానే చేసింది. అయినా నాని టీమ్ అందం, అభినయం గల నాయిక కావడంతో మరో ఆలోచన లేకుండా ఎంపిక చేసారు. ఈ సినిమా కమర్షియల్ గా సక్సెస్ కానప్పటికీ నటిగా ఓ ఐడెంటిటీని తెచ్చిపెట్టింది. అటుపై శర్వానంద్ కు జోడీగా శ్రీకారంలో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమా కూడా అమ్మడిని నిరాశ పరిచింది. దీంతో టాలీవుడ్ లో మళ్లీ ఛాన్స్ రావడానికి మూడేళ్లు పట్టింది. మధ్యలో తమిళ్ లో కొన్ని సినిమాలు చేసింది. అటుపై మళ్లీ ప్రియాంక మోహన్ బాధ్యత నానినే తీసుకున్నాడు. సరిపోదా శనివారంలో హీరోయిన్ గా అవకాశం ఇచ్చాడు. ఈ సినిమా మాత్రం మంచి విజయం సాధించింది. కానీ వెంటనే అవకాశాలు అందుకోవడంలో మాత్రం మళ్లీ విఫలమైంది. సరిగ్గా అదే సమయంలో ఓజీ సినిమాకు సుజిత్ హీరోయిన్ గా ఛాన్స్ ఇచ్చాడు. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది. ఈ సినిమాపై అంచనాలు ఎలా ఉన్నాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. పవన్ కూడా చాలా ఆశలు పెట్టుకున్న ప్రాజెక్ట్ ఇది. అన్ని వైఫల్యాలకు ఓజీ సక్సెస్ ఒక్కటే సమాధానం చెబుతుందని నమ్ముతున్నారు. అటు ప్రియాంక ఆశలన్నీ కూడా ఇదే ప్రాజెక్ట్ పై ఉన్నాయి. ఈ సినిమా విజయంతో బిజీ నటిగా మారాలని ఆశీస్తుం ది. ప్రియాంక గురించి పీకే ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ప్రత్యేకంగా మాట్లాడిన సంగతి తెలిసిందే. ప్రతిభావం తురాలని.. మంచి పాత్రతో ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు. ఇండస్ట్రీలో మంచి భవిష్యత్ ఉంటుందని ఆకాంక్షించారు. మరేం జరుగుతుందన్నది చూడాలి. అయితే ఇక్కడే ఓ వార్త కూడా తెరపైకి వస్తోంది. పవన్ కళ్యాణ్ తో హీరోయిన్ గా నటించిన భామలు పెద్దగా సక్సెస్ అవ్వలేదనే విమర్శ చాలా కాలంగా ఉంది.



# ఓజీ అడ్వాన్స్ బుకింగ్ హంగామా

అగ్ర కథానాయకుడు పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఓజీ. ఈ సినిమాకు సుజిత్ సైన్ దర్శకత్వం వహిస్తుండగా.. డీవీవీ ఎంటర్-టైనమెంట్స్ బ్యానర్‌పై దానయ్య నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ చేస్తుంది చిత్రయూనిట్. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ ఒపెన్ అయినట్లు చిత్రబృందం ప్రకటించింది. బుకింగ్ వెబ్‌సైట్స్ బుక్ మై షో(ఇ÷ఖ ః÷ూ ÷ూరూ)తో పాటు- డిస్ట్రిక్ట్ యాప్‌లలో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.



# మిరాయ్‌లో వైబ్ ఉంది పాట జోడింపు

యంగ్ హీరో తేజ సజ్జ హీరోగా, రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన సైన్స్-ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'మిరాయ్' సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, విడుదలైన అన్ని చోట్ల మంచి కలెక్షన్లు రాబడుతూ, తేజ సజ్జ కెరీర్‌లో మరో హైయెస్ట్ గ్రాసర్ గా నిలిచింది. అయితే, సినిమా విడుదల రోజున ప్రేక్షకులు ఓ విషయంలో తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ప్రీ రిలీజ్ ప్రమోషన్లలో సెన్సేషన్‌గా మారిన 'వైబ్ ఉంది' అనే పాట, చిత్రంలో ఎక్కడా కనిపించకపోవడం ఆ నిరాశకు కారణమైంది. యూత్‌లో దూసుకుపోయిన ఈ పాటను థియేటర్లో చూసేందుకు వచ్చినవారికి అది కనిపించకపోవడం కొంత డిజప్పాయింట్ చేసింది. చివరికి ప్రేక్షకుల డిమాండ్‌కు తలొగ్గిన చిత్రబృందం, సెప్టెంబర్ 23 నుండి 'వైబ్ ఉంది' పాటను సినిమాలో ప్రత్యేకంగా కలిపి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు- అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ పాటను స్క్రీన్ మీద చూడాలని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది గుడ్ న్యూస్ అని చెప్పొచ్చు. ఈ పాట థియేటర్లలో ప్రదర్శించ బోతున్నట్టు- తెలిసిన వెంటనే సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూవీ ఇప్పటికే వంద కోట్ల వసూళ్లు క్రాస్ చేయగా, రానున్న రోజులలో మరిన్ని రికార్డులు సాధించనుందని అంటున్నారు.

# బేబీబంప్‌తో కత్రినా కైఫ్

బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కై-ఫ్, విక్కీ కౌశల్ శుభవార్త చెప్పారు. తల్లిదండ్రులు కాబోతున్నట్లు- తెలుపుతూ ఫొటోను పంచుకున్నారు. వారి జీవితంలో అత్యంత అందమైన దశకు స్వాగతం పలుకు తున్నట్లు- సోషల్ మీడియా వేదికగా తెలిపారు. కొత్త అధ్యాయం ప్రారంభం కానుందంటూ కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను పంచుకున్నారు. దీంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం అనంతరం కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ 2021లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. అప్పటి నుంచి కత్రినా తల్లి కానున్నట్లు- ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. ఆమె వదులుగా ఉండే దుస్తులు ధరించిన ప్రతిసారీ సోషల్ మీడియాలో ఈ వార్తపై ప్రచారం జరిగేది. 'అలాంటి శుభవార్త ఉంటే మేమే స్వయంగా మీతో పంచుకుంటాం. సరైన సమయం వచ్చినప్పుడు మేం ఆ విషయాన్ని చెప్పడానికి సిగ్గుపడం' అంటూ ఈ జంట పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఇప్పుడు వారు అధికారికంగా ఈ శుభవార్త పంచుకోవడంతో అభిమానులు, సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు.కత్రినా 'మల్లీశ్వరి'గా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాతోనే ఆమె టాలీవుడ్‌లోకి ఎంట్రీ-ఇచ్చారు. ఆ తర్వాత బాలకృష్ణ కథానాయకుడిగా రూపొందిన 'అల్లరి పిడుగు'లోనూ సందడి చేసిన విషయం తెలిసిందే. చివరిగా విజయ్ సేతుపతితో కలిసి 'మెర్రీ క్రిస్మస్'తో మెప్పించారు. దీని తర్వాత ఆమె మరో ప్రాజెక్ట్‌ను అంగీకరించలేదు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463